## జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.

ప్రకాశం

APTEL/25/A2843

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 161 సోమవారం 11- 05 - 2026 పేజిలు : 4 వెల. 2

## రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349

## ఎమ్మెల్యే కావ్యకు హనుమాన్ జయంతి ఆహ్వాన పత్రిక అందజేత



**కావలి కంచర్ల మల్లికార్జున రావు క్రైశీ కౌంటర్ ప్రతినిధి,**పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న శ్రీ అభయ ఆంజనేయస్వామి వారి హనుమాన్ జయంతి మహోత్సవ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లిన ఆలయ కమిటీ ప్రతినిధులు కార్యక్రమ వివరాలను తెలియజేసి, మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులను తీసుకోవాలని కోరారు. ఆహ్వాన పత్రికను ఆయన కుఅందజేసి ప్రత్యేక ఆహ్వానం పలికారు. హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న పూజా కార్యక్రమాలు, భజనలు, ప్రత్యేక అలంకరణలు భక్తిశ్రద్ధల మధ్య జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ రెడ్డి,ఆలా శీను,కొండప నాయుడు, మస్తాన్ రెడ్డి, మోహనయ్య పాల్గొన్నారు.

## ఎడ్లపందేల విజేతలకు బహుమతులు అంద జేత ఎమ్మెల్యేలు ఇంటూరి బి.ఎన్.విజయ్ కుమార్



**ఒంగోలు క్రైశీ కౌంటర్ ప్రతినిధి,**మద్దిపాడు మండలం లోని తెల్లబాడు – దొడ్డవరంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన సందర్బంగారాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బల ప్రదర్శనలో మూడవరోజు శనివారం రాత్రి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి. ఎన్. విజయ్ కుమార్ ఆహ్వానంతో, ఆయనతో కలిసి పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూగతంలో రైతులు ఎడ్లను కుటుంబ సభ్యుల్లాగా చూసుకునే వారని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఒంగోలు జాతి ఎడ్లకు గుర్తింపు ఉందని, ఇలాంటి ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాగ్రంధాలయ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి , జిల్లా ఓడా చైర్మన్ షేక్ రియాజ్ జనసేన నాయకులు కంది రవి శంకర్, గొల్లపూడి వీరేంద్ర చౌదరి, రాష్ట్ర పొగాకు బోర్డు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్ బాబు, రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడక స్వాములు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు ,మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు ,గొట్టిపాటి రాఘవరావు , మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు , నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు , మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి మృతి

**క్రైం కౌంటర్ న్యూస్,మే 10 :**గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సారవకోట గ్రామానికి చెందిన బొల్లు తిరుపతిరావు (54) శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ కలహాల నేపథ్యంలో తిరుపతిరావు ఇంటిలో ఉన్న గడ్డిమందు శనివారం తాగి అస్వస్తకు గురయ్యాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో తొలుత నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. తిరుపతిరావు భార్య మాలతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. తిరుపతిరావుకు పెళ్లైన కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## వైద్య వ్యవస్థను ధ్వంసం చేస్తున్న కూటమి సర్కారు వైసీపీ మైనార్టీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్ విమర్శ



**క్రైమ్ కౌంటర్ న్యూస్ ....మార్కాపురం జిల్లా...** వైసిపి హయాంలో ప్రజలకు రక్షణ కవచంగా నిలిచిన వైద్య వ్యవస్థను కూటమి సర్కారు వచ్చి వాటిని సర్వనాశనం చేసిందని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ విమర్శించారు. చాలా ఆసుపత్రులలో సరైన సౌకర్యాలు లేని కారణంగా రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే వైసిపి హయాంలో సకల సౌకర్యాలతో వైద్య వ్యవస్థ చాలా ప్రతిష్టంగా ఉండేదని ఆయన గుర్తు చేశాడు. నేటి ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితిని చూస్తున్న రాష్ట్ర ప్రజలు నాటి వైసిపి పాలనలోని వైద్య వ్యవస్థను గుర్తు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి సర్కార్ వైద్య ఆసుపత్రులలో సకల సౌకర్యాలు సమకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన వైసిపి ఉద్యమిస్తుందని ఆయన హెచ్చరించారు. వైసిపి పాలనలోని వైద్యావ్యవస్థ పతిష్టంగా ఉంటుందని త్వరలోనే జగనన్న సీఎం అవుతారని ప్రజలకు ఆరోగ్య భద్రత లభిస్తుందని ఆయన అభయమిచ్చారూ.....

## పంట పొలాలకు ఎరువులు



**క్రైం కౌంటర్ న్యూస్,మే 10 :** మండలంలోని రైతులు వేసవి దుక్కులకు సిద్ధమయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఉత్సాహంగా దు క్కులు దున్నుతున్నారు. వీటితోపాటు పొలాలకు పశువుల పెంట, కంపోస్టు ఎరువులను వేస్తున్నారు. మరికొందరు రైతులు బోరుబావుల కింద పత్తి విత్తనాలు, ఉల్లి పంటలు సాగు చేస్తున్నారు. అలాగే చెరువులు, కుంటల్లోని సారవంతమైన మట్టిని పొలాల్లోకి తరలిస్తున్నారు. వేసవి దుక్కుల వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు. వేసవిలో లోతుగా దుక్కులు దున్నడం వల్ల భూమి గుల్లగా మారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతాయని, ఇవి భూసార అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. ఖర?ఫకు ముందే భూములను లోతుగా దుక్కులు చేయడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు.

తొలకరి కంటే ముందే దుక్కులు చేపట్టాలి. దీనివల్ల నేల మొత్తబడి వర్షం నీరు భూమిలోకి ఇంకుతాయి. దుక్కులు లోతుగా, వాలుకు అడ్డంగా దున్నుకుంటే వర్షపునీరు భూమిలోకి ఇంకి తేమ నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. దున్నేముందు భూమిలో పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టి వేయాలి. వర్షాకాలం రాకముందే భూమిని మూడుసార్లు దున్నాలని వాలుకు అడ్డంగా దున్నితే అధిక నీరు భూమిలోకి ఇంకింపజే యవచ్చన్నారు. రసాయనిక ఎరువులను, మందులను వినియోగించరాదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

వేసవి దుక్కులతో అధిక ప్రయోజనం

వేసవి దుక్కలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయి. వేసవి దుక్కులు ముందు భూమిలో పశువులపేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టితో భూమి సారవంతమై తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగు తుంది. పొలాల్లో మంటలు వేయడం ద్వారా ఎర్రగొంగళి పురుగులను నివా రించవచ్చు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే సాగు ఖర్చులు తగ్గించు కోవచ్చు. పంట దిగుబడి కూడా బాగా వచ్చే అవకాశం ఉంటుంది.



## మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు: సీఐ మల్లికార్జున

**క్రైమ్ కౌంటర్ న్యూస్... మార్కాపురం జిల్లా...**మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని కంభం సర్కిల్ సిఐ మల్లికార్జునవాహనదారులను హెచ్చరించారు కంభం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాహనదారులకు ఆదివారం సీఐ మల్లికార్జున రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి తోపాటు వెనక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించి వాహనాలపైప్రయాణించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు వాహన సంబంధిత పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. మైనర్లు వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే వాహనం నడిపిన మైనర్ తో పాటు వాహనం ఇచ్చిన యజమాని కూడా నేరస్తులు అవుతారని హెచ్చరించారు.....



## బోయకొండకు ఏటా రూ.16.39 కోట్ల రాబడి

**క్రైం కౌంటర్ న్యూస్,మే 10 :** పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లె మండలం దిగువపల్లె గ్రామం బోయకొండపై వెలసిన గంగమ్మ ఆలయాన్ని 1990లో నాటి పుంగనూరు ఎమ్మెల్యే ఎన్.రామకృష్ణారెడ్డి దేవదాయశాఖకు అప్పగించి ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. కొండపైకి పైపులైను ద్వారా తాగునీరు, విద్యుత్, రోడ్డు తదితర పనులను చేయించగా తర్వాత పుంగనూరు ఎమ్మెల్యేలు ఎన్.అమరనాథరెడ్డి, పి.రామచంద్రారెడ్డి హయాంలో వసతిగృహాలు, రోడ్లు, పుష్కరిణి, కల్యాణకట్ట, షాపింగ్‌కాంప్లెక్స్, ఆలయ పరిపాలన భవనాలు, విద్యుత్ దీపాలు తదితర అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి.

రూ.16.39 కోట్లకు చేరిన ఆదాయం

బోయకొండ గంగమ్మ ఆలయం 1982నుంచి ఎండోమెంట్ ఆధీనంలో చిన్నగుడిగా ఏటాఆదాయం రూ.25వేలు ఉండేది. 1990లో కార్యనిర్వహణాధికారి, సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. దీంతో బోయకొండ గ్రామదేవత ఖ్యాతి కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు వరకు వ్యాపించింది. ఏటా ఆదాయం రూ.16.39 కోట్లకు చేరింది. 2011-12లో రూ.3.89 కోట్లు, 2012లో రూ.3.77 కోట్లు, 2013లో రూ.3.68 కోట్లు, 2014లో రూ.5.06 కోట్లు, 2015లో రూ.5.35 కోట్లు, 2016లో రూ.6.10 కోట్లు, 2017లో రూ.5.45 కోట్లు, 2018లో రూ.6.98కోట్లు, 2019లో రూ.7.21 కోట్లు, 2020లో రూ.3.45కోట్లు, 2021లో రూ.9.27 కోట్లు, 2022లో రూ.11.36 కోట్లు, 2023లో రూ.13,85 కోట్లు, 2024లో రూ.12.20 కోట్లు,2025-26లో ఆదాయం రూ.16,30,97,620కి పెరిగింది.

కర్ణాటక భక్తులే అధికం..

బోయకొండ గంగమ్మ ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోఉన్నా భక్తులు మాత్రం అధికంగా కర్ణాటక నుంచే వస్తున్నారు. ప్రత్యేక పూజలు, మొక్కులు తీర్చుకోవడానికి బంధుమిత్రులతో వచ్చి ఇక్కడే విందులు ఇస్తున్నారు. ఈ క్రమంలో బోయకొండ గంగ మ్మ ఆలయ కమిటీలో కర్ణాటక వారికీ అవకాశాలుంటున్నాయి. కర్ణాటక నుంచి కూడా బస్సులు నడుస్తున్నాయి. బోయకొండ గంగమ్మ ఆలయానికి భక్తులతోపాటు ఆదాయమూ ఏటా పెరుగుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆదాయం లెక్కించగా ఆలయ చరిత్రలో తొలిసారి రూ.16.39 కోట్లు వచ్చింది. గత ఏడాది కంటే రూ.4.11 కోట్లు ఎక్కువగా రావడంతో ఆలయాధి కారులు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ: ఏకాంబరం, డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవోబోయకొండ గంగ మ్మ ఆలయాభివృద్ధికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధుల మంజూరు, అనుమతులకు ప్రయత్నిస్తున్నాం. నేను ఈవోగా వచ్చిన ఒకటిన్నరేళ్లలో ఆలయ ఆదాయం రూ.4.11 కోట్లు పెరిగింది. రూ.వెయ్యితో వేద ఆశీర్వాదం, రూ. 500తో లఘుదర్శనం ప్రవేశపెట్టగా మంచి ఫలితాలు వచ్చాయి. అన్నదానం కోసం రూ.3.50 కోట్లు, గోశాలకు రూ.15లక్షలు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం.

# బ్యాంకులు, ఆర్థిక, బీమా సంస్థల సిబ్బంది పాత్రపై పోలీసుల నజర్



క్రైం కౌంటర్ న్యూస్,మే 10 : లక్షల్లో మ్యూల్ ఖాతాల సృష్టి... తాము దోచేసిన రూ.కోట్లను వాటిలోకి మళ్లించి, కొట్టేస్తున్న సైబర్ నేరగాళ్లు... నకిలీ పత్రాలతో కోట్లాది రూపాయల రుణాలు తీసుకొని ఎగ్గొడుతున్న కేటుగాళ్లు... బతికున్నోళ్లను చంపేసి బీమా సొమ్ము కాజేస్తున్న మోసగాళ్లు... వీళ్లందరి వెనుకా ఆయా ఆర్థిక సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది హస్తం ఉందని పోలీసులు గుర్తించారు. నేర పరిశోధనలో వీరు ఏమాత్రం సహకరించకుండా తమవారిని కాపాడుకుంటున్న వైనాన్నీ ఎత్తిచూపిస్తున్నారు.

మ్యూల్ ఖాతాల వెనుక...

చెన్నైకి చెందిన ఓ యువకుడు కృష్ణా జిల్లా యనమలకుదురులోఉన్న బంధువులతో బ్యాంకు ఖాతాలు తెరిపించాడు. సైబర్ నేరాల ద్వారా వచ్చిన డబ్బులను ఈ ఖాతాల్లో జమచేయించాడు. ఆ సొమ్మును వివిధ మార్గాల్లో తనకు మళ్లించుకున్నాడు. ఈ ఖాతాలు తెరవడానికి ఆ ప్రభుత్వ రంగ బ్యాంకులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి సహకరించాడు. స్వయంగా అతడే కొన్ని ఖాతాలను తెరిచి, సహకరించాడు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి, కేవైసీ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఆయా సంస్థల్లోని అధికారులు కూడా లక్షల్లో జరుగుతున్న అనుమానిత లావాదేవీలపై కన్నేయకుండా నేరగాళ్లకు సహకరిస్తున్నారు.

బీమా పాలసీలనూ నొక్కేస్తున్నారు...

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఒక అధ్యాపకుడు తన కుమార్తెల భవిష్యత్ అవసరాల కోసం వేర్వేరు ప్రైవేటు బీమా సంస్థల నుంచి పాలసీలు తీసుకున్నారు. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి ఆ పాలసీలకు నకిలీ పత్రాలు సృష్టించాడు. అసలు పాలసీదారుడిగా అవతారమెత్తాడు. అసలు పాలసీలు పరిశీలించే అవకాశం అతనికి రావడానికి సదరు బీమాసంస్థలోని ఉద్యోగులే సహకరించారు. ఆ తరువాత అతను ఇచ్చిన నకిలీ పత్రాలను ఏ మాత్రం పరిశీలించకుండా సహకరించారు. దీంతో ఆ మోసగాడు రూ. 16 లక్షలు తన ఖాతాలో జమ చేయించుకున్నాడు. ఈ కుట్రలో బీమా సంస్థకు చెందిన ఏజెంట్ ఉన్నాడని పోలీసులు నిర్ధారించారు.

కంపెనీ నకిలీ పత్రాలతో...

గుంటూరుకు చెందిన మారం మోహన్ మరికొంతమందితో కలసి విజయవాడకు చెందిన రాజ్ ఎంటర్‌ప్రైజస్ లేబర్ లైసెన్స్, జీఎస్టీ లైసెన్స్‌లకు నకిలీలు తయారు చేయించాడు. వాటిని ఉపయోగించుకుని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల నుంచి కోట్లాది రూపాయల రుణాలు పొందాడు. ఇందుకు ఆయా సంస్థల్లో ఉద్యోగులు సహకరించారు. షెల్ కంపెనీల పేరుతో ఖాతాలను తెరవడానికి, వాటిలోకి నిధులు మళ్లించుకోవడానికి సైబర్ నేరగాళ్లకు ఆస్కారమిస్తున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలోనే ఇలా సహకరించిన బ్యాంకు సిబ్బంది, మేనేజర్లను దేశ వ్యాప్తంగా పదుల సంఖ్యలో పోలీసులు, కేంద్ర నేర పరిశోధనా సంస్థలు అరెస్టు చేశాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది.

సిబ్బంది సంపూర్ణ సహకారంతోనే...

ఈ మోసాల తీరు వేర్వేరుగా ఉన్నా... వాటన్నింటి మధ్యా ఒక సారూప్యత ఉంది. ఆయా సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది నిందితులకు సంపూర్ణ సహకారం అందించారు. ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు పోటీగా ప్రైవేటు బ్యాంకులు కార్యకలాపాలను విస్తరించాయి. వాటితోపాటు కొత్త ఫైనాన్స్ సంస్థలు మార్కెట్‌లోకి అడుగుపెడుతున్నాయి. భవిష్యత్తు అవసరాల కోసం, పిల్లల కోసం తమ సంపాదనలో కొంత మొత్తాన్ని పాలసీల రూపంలో భద్రపరచుకునే వారి సంఖ్య పెరిగింది. అదే సమయంలో వారి సొమ్ముకు సంపూర్ణ భద్రతా ప్రశ్నార్థకమవుతోంది. అన్ని రంగాల్లోను ఆన్‌లైన్ సేవలు విస్తరించాయి. వినియోగదారులు బీమా పాలసీ తీసుకోవాలన్నా, సొమ్ము వెనక్కు తీసుకోవాలన్నా, రుణాలు పొందాలన్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే అవకాశం అందుబాటులోకి వచ్చింది. దీనిని ఆసరా చేసుకొని మోసగాళ్లు నకిలీ పత్రాలతో ఆన్‌లైన్‌లో రుణాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. వాటిని పరిశీలించే సిబ్బందితో కమీషన్ ఇచ్చేలా ఒప్పందం చేసుకుంటున్నారు. దీనితో సిబ్బంది దరఖాస్తులను పైపైనే పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నట్టు రిమార్కులు రాసి సంతకాలు చేస్తున్నారు. తర్వాత చకచకా రుణాలు మంజూరు చేస్తున్నారు. సిబ్బంది మిలాఖత్ అవడంతో జరుగుతున్న మోసాలపై నమోదు అవుతున్న కేసులన్నీ చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందంగానే ఉంటున్నాయి. కేసుల దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆయా సంస్థలకు వెళ్లి వివరాలు అడిగినప్పుడు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారు. అన్ని దరఖాస్తులు, రికార్డులు ముంబై, ఢిల్లీ, కోల్‌కతాలోని ప్రధాన కార్యాలయాల్లో ఉంటాయని చెబుతున్నారు. తద్వారా తమ తప్పులు పోలీసుల చేతికి చిక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చివరికి సీసీ ఫుటేజీల విషయంలోనూ ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు.

# ఉపాధి కూలీలకు కానరాని వసతులు

క్రైం కౌంటర్ న్యూస్,మే 10 : భగభగ మండే ఎండల ప్రభావంతో ఉపాధిహామీ కూలీలు విలవిల్లాడిపోతున్నారు. పనులు చేసేచోట నీడ, తాగునీరు తదితర సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వడదెబ్బ తగిలితే తక్షణమే కాపాడేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు కూడా అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 4,31,457 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఉపాధిహామీ వేతనదారులు 7,21,957 మంది ఉన్నారు. ప్రస్తుతం ఎండల ప్రభావంతో చాలామంది పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో శనివారం 1,67,542 మంది వేతనదారులు మాత్రమే పనులకు వెళ్లారు. పాతపట్నం మండలంలో సుమారు 3,900 మంది వేతనదారులు చెరువుల్లో పూడికతీత, కాలువల శుభ్రత, మట్టి పనులు చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 5–30 నుంచి 10గంటల వరకు మధ్యాహ్నం 3నుంచి 6గంటల వరకు ఉపాధి కూలీలు పనులకు వెళ్తున్నారు. కాగా పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కనీస మౌలిక వసులు లేక వేతనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. ఎండ వేడికి ఉపాధి కూలీలు చెమటలు కక్కుతున్నారు. కాసేపు సేద తీరుదామన్నా నీడ లేదు. సమీపంలో చెట్లు ఉంటే కొంత పరవాలేదు. లేదంటే అంతే. జిల్లాలో చాలాచోట్ల ఉపాధిహామీ వేతనదారులు పనిచేసే చోట టెంట్‌లు కానీని, మెడికల్ కిట్‌లు గాని అందుబాటులో లేవు. దీంతో కూలీలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. తాగునీటి సౌకర్యం కూడా లేక అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీల్లోని హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాల్లో మెడికల్ కిట్‌లు ఉన్నా కూలీలకు అందుబాటులో ఉంచడం లేదు. ఓఆర్ఎస్, ఐయోడిన్, పారాసెట్మాల్ మాత్రలు, దూది వంటివి సంబంధిత సబ్ సెంటర్ నుంచి తీసుకువెళ్లాలి. ఆ విధంగా క్షేత్రసహాయకులు చేయడంలేదు. గతంలో పనిచేసిన చోట ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచేవారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కూలీలకు వడదెబ్బ తగిలినా.... గునపాం, పార కళ్లకు తగిలి గాయాలైనా ప్రథమ చికిత్స అందించే పరిస్థితి లేదని వేతనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పని స్థలాల్లో తాగునీరు, విశ్రాంతి షెడ్లు, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

అందని వేసవి అలవెన్స్‌లు



ఉపాధిహామీ పథకంలో వేసవి కాలంలో పనిచేసే కూలీలకు గతంలో వేసవి అలవెన్స్‌లు ఉండేవి. మొత్తం కూలీకి వచ్చే వేతనంలో ఫిబ్రవరి నెలలో 20శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్ నెలలో 30శాతం అదనంగా అలవెన్స్‌లు ఇచ్చేవారు. అవాస ప్రాంతాలకు ఐదు కిలోమీటర్లు అవతల పనులు చేస్తుంటే కూలి మొత్తానికి 10 శాతం ప్రయాణ అలవెన్స్‌లు ఇచ్చేవారు. ప్రస్తుతం అలవెన్స్‌లు కూడా లేవని వేతనదారులు పేర్కొంటున్నారు.

నీడ లేదు :

పనులు చేసిన ప్రదేశంలో నీడ లేక ఎండకు ఇబ్బందులు పడుతున్నాం. గతంలో టార్పాలిన్లు వేసి నీడ కల్పించే వారు. ఇప్పుడు మాత్రం నీడలేక అవస్థలు పడుతున్నాం.

– తాడేల యామిని, ఉపాధి హామీ వేతనదారు

నీడ కల్పిస్తే మంచిది :

పనులు చేసే ప్రదేశంలో నీడ కల్పిస్తే మంచిది. ఎండలకి పడిపోతాం అనే భయమేస్తుంది. పనులు చేయకపోతే బతుకు నడవదు.

– పెద్దింటి సరోజిని, ఉపాధి హామీ వేతనదారు

వసతులు కల్పిస్తున్నాం

ప్రతిరోజు పనులను పరిశీలిస్తున్నాం. వేతనదారులు ఎండలో ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తాం. పనిచేసే చోట మౌలిక వసతులతో పాటు ఫస్ట్‌ఎయిడ్ కిట్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

# రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు




క్రైం కౌంటర్ న్యూస్,మే 10 అలికాం–బత్తిలి ప్రధానరోడ్డుపై రావిచెంద్రి జంక్షన్ సమీపంలో శనివా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలు గురు గాయపడా ?డరు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం మండ లం రాగోలు గ్రా మానికి చెందిన అనిల్‌కుమార్, గౌతమి, రోజారాణి హిరమండలంలో శనివారం జరుగు తున్న వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. తిరిగి వారు స్వగ్రామానికి వస్తుండగా.. రావిచెంద్రి జంక్షన్ సమీపానికి వచ్చేసరికి కడగండివలస గ్రామానికి చెందిన రాఘవ ద్విచక్రవాహనంపై వారి వెనుకనుంచి వస్తూ ఢీకొనడంతో రోడ్డుపై పడిపో యారు. రెండు వాహనాలపై ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనం సిబ్బంది ఈఎన్‌టీ మూర్తి, పైలెట్ ఎస్‌వీ రమణ ఘటనా స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆమదాలవలస మండలం జొన్నవలసలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## తెలంగాణపై బీజేపీది సవతి తల్లి ప్రేమ: ప్రభుత్వ విప్

హైదరాబాద్, మే10: తెలంగాణపై మొదటి నుంచి బీజేపీ సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఈ 12 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు తీసుకువచ్చిన నిధులు ఎంతో బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కాగానే ఏడు మండలాలను ఆంధ్రాకు కేటాయించారని విమర్శించారు. పాలమూరు– రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పారు.. కాని ఆ తర్వాత ఆ ఊసే లేదని బీజేపీ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంతో శరవేగంతో పనులు జరుగుతున్నాయని వివరించారు.మా పాలమూరు బిడ్డలు భారతదేశంలో లేరా? ఎందుకంత నిర్లక్ష్యం అని కేంద్రంలోని సర్కార్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. గుజరాత్‌లో గిఫ్ట్ సిటీ ఏర్పాటు చేసి.. పారిశ్రామిక రాయితీలు ఇస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు కూడా రాయితీ ఇస్తే బాగుండేది.. కాని తీరని అన్యాయం చేశారంటూ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం లేకపోవడంతో సొంత నిధులతో చేపట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీని చూడగానే తెలంగాణ బీజేపీ నాయకులు నోరుమెదపడం లేదని వ్యంగ్యంగా అన్నారు. కేంద్రం ఇచ్చే గ్రాంట్లు, నిధులు అన్నింట్లో ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే.. తెలంగాణకు అన్యాయం జరుగుతుందన్నారు. ఏపీకి నిధుల వరద పారుతోందని గుర్తు చేశారు. ఎంపీలను గెలిపించిన తెలంగాణను మాత్రం పట్టించుకోవడం లేదంటూ కేంద్రంలోని బీజేపీ నేతలపై నిప్పులు చెరిగారు.


బీజేపీ ఎంపీల నోరు పెద్దదని.. ప్రతిపక్షాలను విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం నిధులు, ప్రాజెక్టులు తీసుకువద్దామన్న ఆలోచన చేయడం లేదంటూ బీజేపీ ఎంపీలకు చురకలంటించారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు అనేక అడ్డంకులు కల్పించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ఏటీఎం సెంటర్ అని, కేసీఆర్ కుటుంబం అవినీతిమయం అని ప్రధాని మోదీ అనేక సార్ల పేర్కొన్నారని తెలిపారు. దేశంలోనే అత్యధిక అవినీతి కలిగిన రాష్ట్రం తెలంగాణ అని మోదీ విమర్శించారని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై ఈగ కూడా వాలనివ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఒక్క కేసుపైన కూడా విచారణ జరపలేదని వివరించారు. వంద రోజుల్లో కేసీఆర్‌ను జైలులో వేస్తామని బీజేపీ నాయకులు అన్నారని గుర్తు చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్ బలం ఫెవికాల్ కంటే ధృడమైనదని అభివర్ణించారు. గతంలో కేంద్రం తీసుకువచ్చిన ప్రతి బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు. కేసీఆర్ కుటుంబంపై ఐటీ, ఈడీ, సీబీఐలు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. విద్యలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఎందుకు సహకరించడం లేదు..? అని సందేహం వ్యక్తం చేశారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి ఎడ్యుకేషన్‌కు సంబంధించిన రుణాలను మినహాయించాలని కోరితే కేంద్రం పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు.

అమరావతి నిర్మాణం కోసం వేల కోట్లు ఇస్తున్న కేంద్రం భారత్ ఫ్యూచర్ సిటీకి రూపాయి కూడా ఇవ్వడం లేదన్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి బీజేపీ నాయకులు అడ్డు పడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ తోకపట్టుకుని కూర్చీలో కూర్చోవాలని బీజేపీ ప్రయత్నం చేస్తుందన్నారు. అవినీతి బీఆర్ఎస్ నాయకులను జైలులో పెట్టాలన్న ఆలోచన బీజేపీకి లేదని పేర్కొన్నారు. బీజేపీ ఎంపీలు రాష్ట్ర హితం కోసం ఆలోచడం లేదని తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసానంద సరస్వతి

క్రైం కౌంటర్ న్యూస్,మే 10 : నగర పరిధి తోటపాలెం కూడలి వద్ద ఉన్న విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యాలయ ఆవ రణలో శనివారం పదమూడున్నర అడుగుల వీర అభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణ ఘనం గా నిర్వహించారు. వీహెచ్‌పీ ఉత్తరాంధ్ర సహ కార్యదర్శి ఫల్గుణరావు దంపతులతో ప్రత్యేక పూజలు, హోమం అనంతరం ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఆవిష్కరిం చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ వీరహనుమను దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయా లను పరిరక్షించాలని కోరారు. భారీ విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంద న్నారు. వీహెచ్‌పీ ఉత్తరాంర?ధ అధ్యక్షుడు వబిలి శెట్టి వేంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హిందూ సమా జ చైతన్యానికి ఇది ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా విరా జిల్లాలన్నారు. శ్రీనివాసానంద స్వామి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్ర మంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఎల్.ఆనంద రావు, ఉపాధ్య క్షులు గొద్దు భాస్కరరావు, శ్రీరంగం మధుసూ దనరావు, కార్యదర్శి చంద్రశేఖర్, టంకాల సూరప్పడు, భజరంగ్‌దళ్ ప్రాంతీయ సంయోజక్ రావాడ రాగశేఖర్, జిల్లా కన్వీనర్ కొయ్యాన కిరణ్ కుమార్, పీవీ శ్రీనివాస్, బాలాజీ గుప్త తదితరులు పాల్గొన్నారు.






## జాతీయ స్థాయిలో కుప్పం సత్తా!

### ఉత్తమ బ్లాక్ పంచాయతీల్లో మూడో ర్యాంకు
### రాష్ట్రానికి మొత్తం ఐదు అవార్డులు

**క్రైం కౌంటర్ న్యూస్,మే 10 :** జాతీయ పంచాయతీ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ ఆధిపత్యాన్ని చాటుకుంది. ముఖ్యంగా చిత్తూరు జిల్లా కుప్పం పంచాయతీ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర కీర్తిని ఇనుమడింపజేసింది. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ శనివారం ప్రకటించిన 'జాతీయ పంచాయతీ అవార్డులు-2025'లో ఏపీకి మొత్తం ఐదు అవార్డులు దక్కాయి. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు సత్తా చాటగా, ఏపీ మొత్తం 5 అవార్డులు దక్కించుకోవడం గమనార్హం. జూన్ 3న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ తెలిపింది. 'సుపరిపాలన' విభాగంలో విశాఖపట్నం జిల్లా నాథవరం మండలం శృంగవరం గ్రామ పంచాయతీ దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి ర్యాంకును సాధించింది. ప్రజలకు మెరుగైన్న సవలు అందించడంలో ఈ పంచాయతీ దేశానికే ఆదర్శంగా నిలిచింది. దీంతో 'శృంగవరం' పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నగదు పురస్కారాన్ని ప్రకటించింది. మహిళా సంక్షేమం, మహిళా స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడంలో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం 'బొక్కసంపాలెం' పంచాయతీ దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకుంది. మహిళల అభివృద్ధికి చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలకు గుర్తింపుగా రూ.కోటి నగదు బహుమతిని కూడా ఈ పంచాయతీ దక్కించుకుంది. 'పేదరిక నిర్మూలన' విభాగంలో కడప జిల్లా ఖాజీపేట మండలం 'చెముళ్లపల్లి' పంచాయతీ దేశంలోనే రెండో ర్యాంకు సాధించి, రూ.75 లక్షల నగదు బహుమతి దక్కించుకుంది. 'ఉత్తమ బ్లాక్ పంచాయతీ' విభాగంలో 'కుప్పం' దేశంలోనే మూడవ ర్యాంకు సాధించి రూ.1.50 కోట్ల పురస్కారాన్ని పొందింది. 'మౌలిక సదుపాయాల' విభాగంలో ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం 'గుండమాల' పంచాయతీ 3వ ర్యాంకు సాధించి, రూ.25లక్షల నగదు బహుమతిని దక్కించుకుంది.

## సొంత స్థలం ఉన్న వారికి ప్రాధాన్యం



**క్రైం కౌంటర్ న్యూస్,మే 10 :** సొంత ఇల్లు నిర్మించుకోవాలని ఆశతో ఎదురు చూస్తున్న పేదల కల సాకారం కానుంది. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో సుమారు 15 వేల ఇళ్లు అనకాపల్లి జిల్లాకు కేటాయిస్తారని అధికారవర్గాల సమాచారం. వచ్చే నెలలో లబ్ధిదారుల ఎంపిక జరగనున్నది.

గత వైసీపీ ప్రభుత్వం పేదలకు స్థలాలతో పాటు ఇళ్లు కూడా నిర్మించి ఇస్తామని హామీలు గుప్పించింది. పలుచోట్ల వేసిన లేఅవుట్ ప్రాంతాలు నివాసానికి యోగంగా లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు రాలేదు. మరికొంతమంది ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు చాలవంటూ ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆపేశారు. కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణం తామే చేపడతామంటూ వైసీపీ నేతలు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి, లబ్ధిదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేశారు. పునాదుల వరకు నిర్మాణం చేపట్టిన తరువాత గిట్టుబాటు కావడం లేదంటూ చేతులెత్తేశారు. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, సబ్బవరం మండలాల్లో అసంపూర్తి ఇళ్లు అధికంగా దర్శనమిస్తున్నాయి.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొనేందుకు గత ఏడాది ఎస్సీ, బీసీ అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున మంజూరు చేసింది. సుమారు రెండు వేల మంది అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద రాష్ట్రానికి 2.5 లక్షల గృహాలు మంజూరు చేసింది. ఇందులో అనకాపల్లి జిల్లాకు సుమారు 15 వేల ఇళ్లు కేటాయించే అవకాశం వుందని గృహనిర్మాణ సంస్థ అధికారులు చెబుతున్నారు. మరోవైపు తమకు సొంత గూడు లేదని, ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేయాలంటూ జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు 45,354 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎక్కువ మంది అనకాపల్లి, చోడవరం, మాడుగుల మండలాలకు చెందిన వారు వున్నారు. అత్యల్పంగా కశింకోట, మునగపాక మండలాల నుంచి దరఖాస్తులు అందాయి. సొంత స్థలం ఉండి, ఇంటిని నిర్మించుకునేందుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఇళ్లు మంజూరు చేయనున్నట్టు గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో పక్కా ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపామని, ఆమోదం లభించిన వెంటనే లబ్ధిదారుల ఎంపిక చేపడతామని ఆయన చెప్పారు.

## ముప్పై ఏళ్ల సర్వీసులో మూడు పట్టీలే దిక్కా?

### ప్రమోషన్ల కోసం హెచ్‌సీల ఎదురు చూపులు
### రాష్ట్రంలో వందల సంఖ్యలో ఏఎస్ఐల ఖాళీలు
### సివిల్, ఏఆర్ పోలీసుల మధ్య సర్వీసు వార్



**క్రైం కౌంటర్ న్యూస్,మే 10 :**దాదాపు 30 ఏళ్ల క్రితం పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరారు. త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. మొత్తం సర్వీసులో పొందిన పదోన్నతి ఒక్కటంటే ఒక్కటే!. కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా మూడు పట్టీలు భుజానికి తగిలించుకోవడం!!. అయితే, తాము పదవీ విరమణ చేసేలోపైనా సింగిల్ స్టార్(ఏఎస్ఐ) భుజంపైకి వస్తుందని వారంతా ఆశ పడుతున్నారు. ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నా ఏఎస్ఐ అయ్యే అవకాశం కనిపించడం లేదు. పోలీసు శాఖలో ఖాళీలు లేవా అంటే వందల సంఖ్యలో ఏఎస్ఐ పోస్టులు ఉన్నాయి. అయినా, పదోన్నతులు ఎందుకు లభించడం లేదు. దీనికి కారణం ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం తీరేనని చెబుతున్నారు. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) పోలీసులకు మధ్య ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం అధికారులు సర్వీస్ రూల్స్ వివాదాన్ని రాజేసి చోద్యం చూస్తున్నారని పలు జిల్లాల హెడ్ కానిస్టేబుళు వాపోతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించి పదవీ విరమణ లోపైనా తమకు పదోన్నతి కల్పించాలని విన్నవిస్తున్నారు.

ప్రాతిపదికల మార్పు

రాష్ట్ర పోలీసు శాఖలో 1991-94 మధ్యలో కానిస్టేబుళ్లుగా చేరిన సిబ్బందికి ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996 ప్రకారం ఖాళీలను పరిగణనలోకి తీసుకుని 2016-17 మధ్య హెడ్ కానిస్టేబుళ్లు(హెచ్‌సీ)గా పదోన్నతి లభించింది. తర్వాత ప్రమోషన్ ఏఎ?సఐగా 2024-25 మధ్యలో రావాల్సి ఉంది. అమల్లో ఉన్న సర్వీస్ రూల్స్ ప్రకారం పదోన్నతులు కల్పించాల్సిన పోలీసు శాఖ జిల్లాకొక విధంగా వ్యవహరించింది. దీంతో పదోన్నతుల ప్రక్రియకు మెలిక పడింది. పోలీసు ప్రధాన కార్యాలయం 2013లో ప్రీ ప్రమోషనల్ ట్రైనింగ్‌కు పంపే ప్యానల్.. సెప్టెంబరు 1ని ప్రాతిపదికగా నిర్ణయిస్తూ రాష్ట్రంలోని కొన్ని జిల్లాలకు సర్క్యులర్ జారీ చేసింది. ఆ తర్వాత కొన్ని జిల్లాలకు జనవరి 1ని ప్రాతిపదికగా తీసుకున్నారు. అయితే, దీని వెనుక ఏపీఎస్‌పీ, ఏఆర్ నుంచి వచ్చిన వారి ప్రయోజనాల కోసమేనని సివిల్ పోలీసులు ఆరోపిస్తున్నారు. తాము నేరుగా సివిల్‌లో ఎంపికయ్యామని, ఏఆర్ పోలీసులు సివిల్‌లోకి కన్వర్షన్ అయినప్పటి నుంచి సర్వీస్ పరిగణనలోకి తీసుకుంటే అభ్యంతరం లేదని చెబుతున్నారు. దీనికి ఆర్మ్‌డ్ పోలీసులు ససేమిరా అంటున్నారు. తాము పోలీసు శాఖలో సీనియర్లమని, ఏ విభాగంలో పని చేసినా తమ సర్వీసును గుర్తించాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఏఆర్ ఎస్ఐల విషయంలో కోర్టు తీర్పును ప్రస్తావిస్తూ అదే విధానాన్ని పాటించాలని కోరుతున్నారు.

ఒక్కో జిల్లాకు ఒక్కో విధంగా..

పోలీసు శాఖలో సివిల్, ఏఆర్ విభాగాలు ఉన్నాయి. సివిల్ విభాగంలోకి కన్వర్షన్ కోసం ఏఆర్ పోలీసులు దరఖాస్తు చేసుకుంటే కొన్నేళ్ల తర్వాత అనుమతి లభిస్తుంది. అలా కన్వర్షన్ అయిన ఏఆర్ పోలీసులకు ఎప్పుడైతే సివిల్‌లోకి వస్తారో అప్పటి నుంచి సర్వీసు పరిగణనలోకి తీసుకోవాలని సివిల్ పోలీసులు చెబుతున్నారు. అదే ప్రామాణికంగా తీసుకోవాల్సిన ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం పదోన్నతుల ప్యానల్ సెప్టెంబర్ 1 నుంచి మొదలు పెట్టాలని కొన్ని జిల్లాలకు, జనవరి 1 నుంచి పరిగణనలోకి తీసుకోవాలని మరికొన్ని జిల్లాలకు లేఖలు రాసింది. రెండు వేర్వేరు తేదీలతో ఆయా జిల్లాల మినిస్టీరియల్ సిబ్బంది తమకు అందిన లేఖ ప్రకారం సర్వీస్ రిజిస్టర్లు పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపారు. కానీ, దీనిపై సివిల్ హెడ్ కానిస్టేబుళ్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే రాష్ట్రంలో జిల్లాకొక నిబంధన ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో కొందరు కోర్టును ఆశ్రయించారు.

సివిల్, ఏఆర్ పోలీసుల పదోన్నతుల సర్వీస్ రూల్స్ న్యాయస్థానమే పరిష్కరిస్తుందని కొందరు హైకోర్టులో రిట్ వేశారు. అయితే, ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారులు, జిల్లాల్లోని మినిస్టీరియల్ సిబ్బంది ఎలాంటి కౌంటర్ వేయకుండా ఉద్దేశ పూర్వకంగా జాప్యం చేస్తున్నారని హెడ్ కానిస్టేబుళ్లు ఆరోపిస్తున్నారు. తప్పు సరిదిద్ది తమకు ఉన్నతాధికారులు న్యాయం చేస్తే రిట్ పిటిషన్లు వెనక్కి తీసుకుంటామని, లేదంటే తొందరగా కౌంటర్ దాఖలు చేస్తే కోర్టు తీర్పునకు అనుగుణంగా అర్హులైన వారికి పదోన్నతులు లభిస్తాయని చెబుతున్నారు.

పాతికేళ్లుగా కానిస్టేబుళ్లుగానే!

పోలీసు శాఖలో కానిస్టేబుళ్లుగా 1998, 2000లో చేరిన వారికి పాతికేళ్లయినా ఒక్క ప్రమోషన్ కూడా రాలేదు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ 50నుంచి 80 దాకా హెడ్ కానిస్టేబుల్ పోస్టులున్నా సివిల్, ఏఆర్ సర్వీసు వివాదంతో పదోన్నతులు ఆగిపోయాయి. ఏపీఎస్‌పీలో ఉద్యోగం పొందిన కానిస్టేబుళ్లు ఐదేళ్ల తర్వాత సివిల్ నోటిఫికేషన్ పడటంతో సివిల్‌లో ఉద్యోగం పొందారు. సివిల్‌లో ఎప్పుడు ఉద్యోగం వచ్చిందో అప్పటి నుంచే సీనియారిటీ పరిగణలోకి తీసుకోవాలని ఆ బ్యాచ్ సివిల్ పోలీసులు వాదిస్తుండగా అంతకు ముందు ఏపీఎస్‌పీలో తమ సర్వీసును లెక్కించాల్సిందేనని ఏపీఎస్‌పీల నుంచి సివిల్‌లో ఉద్యోగం పొందిన కానిస్టేబుళ్లు వాదిస్తున్నారు. ఈ వివాదంతో రాష్ట్ర వ్యాప్తంగా 1100 మంది సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు కోర్టును ఆశ్రయించడంతో సమస్య ఎప్పటికి పరిష్కారం అవుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోర్టులో సమస్య పరిష్కారం అయ్యేందుకు సమయం పడుతుండటంతో 2 ఇంక్రిమెంట్లు కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అటు వ్యాయామం.. ఇటు మానసికోల్లాసం

### భారతీయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వైనం
### బాలింతల సంరక్షణ, పిల్లల పెంపకంలో తోడ్పాటు
### మే-ఆగస్టు నెలల మధ్య అధికంగా అమెరికాకు...

**క్రైం కౌంటర్ న్యూస్,మే 10 :** అమెరికాలోని తమ పిల్లల వద్దకు వచ్చే తెలుగువారు ముదిమి వయసులోనూ సరికొత్త స్నేహగీతాలు లిఖిస్తున్నారు. సాయంకాలంపూట స్థానిక పార్కుల్లో, కమ్యూనిటీ కేంద్రాల్లో కలుసుకుని కబుర్లు చెప్పుకొంటూ సేదతీరుతున్నారు. మే-ఆగస్టు నెలల మధ్య వీరు అత్యధిక సంఖ్యలో అమెరికాకు వస్తున్నారు. ఇండియాలో ఎండల తీవ్రత, అమెరికాలోని మనవల బడులకు సెలవులు కావడం దీనికి కారణం. పదవీ విరమణ చేసినవారితో పాటు ఉద్యోగస్తులు కూడా అమెరికా వస్తున్నారు. పిల్లలు ఆఫీసులకు వెళ్లిపోయాక ఇంట్లో ఒంటరిగా గడిపే వీరంతా సాయంకాలం స్థానికంగా ఒకచోట కలుసుకుని నడక, సైక్లింగ్ వంటి వ్యాయామాల్లో పాల్గొంటూ కబుర్లు చెప్పుకుంటూ ఒకరికొకరు మానసికంగా ఆసరాగా నిలబడుతున్నారు. బయటకు ఒక్కరే వెళ్లలేకపోవడం, భాష సమస్య వంటి సవాళ్లకూ అమెరికా పార్కులు సమాధానమిస్తున్నాయి. నలుగురితో కలివిడిగా ఉండటం వల్ల సొంత నెట్‌వర్క్ ఏర్పడి పిల్లలమీద ఆధారపడాల్సిన అవసరాన్ని తగ్గించుకుంటున్నారు. భిన్న భాషలు, భిన్న రాష్ట్రాల వారితో పరిచయాలు స్నేహాలుగా మారి.. రోజువారీ సమావేశాలు, సామూహిక కార్యక్రమాలుగా విస్తరిస్తున్నాయి. వాట్సాప్ వంటి వేదికల ద్వారా ఈ సమూహాలు మరింత బలపడుతున్నాయి. నడక గ్రూపులు, పూజలు, పిక్నిక్‌లు, పరస్పర ఆహ్వానాలు వంటి కార్యకలాపాలు సాధారణంగా మారుతున్నాయి. దీనివల్ల విదేశంలో ఉన్నప్పటికీ ఒక ఆత్మీయ వాతావరణం ఏర్పడుతోంది. భారతదేశానికి తిరిగి వెళ్లిన తర్వాత కూడా ఈ సంబంధాలు కొనసాగుతున్నాయి. అమెరికాకు వచ్చినప్పుడు మళ్లీ కలుసుకుంటున్నారు.

కార్పొరేట్ ఉద్యోగాల్లో ఉన్న ఎన్నారై దంపతులకు మాతృత్వ సెలవులు తక్కువగా ఉండటం, నవజాత శిశువుల డే-కేర్ సెంటర్లు, ఆలనాపాలన చూసే ఆయాల ఖర్చు భారీగా ఉండటంతో ఒక ఆరు నెలలు తల్లిదండ్రులు, మరో ఆరు నెలలు అత్తమామలు ఈ శిశువులు, బాలింతల సంరక్షణ చూసుకునేందుకు అధికసంఖ్యలో వస్తున్నారు. గ్రాడ్యుయేషన్లు, వివాహాలు, గృహప్రవేశాలు, ఆరోగ్య పరీక్షలు, టూరిజం వంటివి తర్వాతి స్థానాల్లో ఉంటున్నాయి. ఎదిగిన పిల్లలు ఉన్నవారు.. ఆయా చిన్నారులకు కథలు చెప్పడం, ఆటలు ఆడించడం, స్థానికంగా పర్యటించడం వంటివాటి ద్వారా బంధాన్ని బలపరుచుకుంటున్నారు. ఆరు నెలలు ఇంటికి దూరంగా ఉన్నప్పటికీ వేలమైళ్ల ఆవల ప్రతిరోజూ ఇరుగుపొరుగుతో కొత్త పరిచయాలు పెంచుకుంటూ తెలుగుదనానికి దగ్గరగా జీవనం గడుపుతున్నారు.

స్థానిక కార్యక్రమాల్లో సందడి

అమెరికాకు వచ్చే తెలుగు ఎన్నారైల తల్లిదండ్రులు ఇంటికే పరిమితం కావట్లేదు. పరిచయాలు పెంచుకుని స్థానికంగా జరిగే భారతీయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఒక బృందంగా ఏర్పడి కార్లు, బస్సుల్లో సభాప్రాంగణాలకు వెళ్లి సందడి చేస్తున్నారు. భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో పాటు పండుగలు, యోగా, మాతృ భాషా దినోత్సవాలు కూడా సమష్టిగా జరుపుకుంటున్నారు.

ఏడాది ముందే ప్రణాళిక

అమెరికాకు వచ్చే ప్రవాసాంధ్రుల తల్లిదండ్రులు ఏడాది ముందే తమ ప్రయాణ ప్రణాళికలను ఖరారు చేసుకుని, విమాన టికెట్లు కొంటున్నారు. అప్పటి నుంచి ప్రయాణ తేదీకి మధ్య జరిగే అంతర్జాతీయ పరిణామాలు వీరిపై ప్రభావం చూపట్లేదు. ఉద్యోగస్థుల మాదిరి కాకుండా ప్రయాణ తేదీల్లో పూర్తి వెసులుబాటు ఉండటంతో టికెట్లపై విమానయాన సంస్థలు చేసే మార్పులను సైతం వీరు స్వాగతిస్తున్నారు. క్యాన్సిలేషన్ ఫీజు లేకపోవడం, ధరలో మార్పు లేకుండా టికెట్ మార్చుకోగలిగే అవకాశాలు సానుకూల అంశాలుగా ఉంటున్నాయి.

యువకుల కన్నా చురుగ్గా ఉంటున్నారు
-భాను మాగులూరి, ఎన్నారై పేరెంట్స్
అసోసియేషన్ వ్యవస్థాపకుడు, వర్జీనియా

తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే ఎన్నారైల తల్లిదండ్రులు స్థానిక యువత కన్నా చురుగ్గా ఉంటున్నారు. ఫలానా చోట కార్యక్రమం అంటే స్వయంగా రవాణా ఏర్పాట్లు చేసుకుని మరీ పాల్గొంటున్నారు. ఆపరేషన్ సిందూర్‌కు అమెరికా నుంచి సంఘీభావం తెలపడంలో వీరు ముందువరుసలో ఉన్నారు. డీసీలోని భారత ఎంబసీ వద్ద జాతీయ దినోత్సవాలు నిర్వహించినప్పుడు వారి సందడి ఆకట్టుకుంది. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో అతిథులుగా హాజరవుతున్నారు. వేడుకల్లో పాల్గొనేవారి సంఖ్య అధికంగా ఉన్నప్పుడు బస్సులు ఏర్పాటు చేసిన సందర్భాలున్నాయి.

ఎక్కడైనా తల్లిదండ్రులదే కీలక పాత్ర

"డల్లాస్ పరిసర ప్రాంతమైన లిటిల్ ఎల్మ్‌లో పర్యటిస్తున్న ఎన్నారైల తల్లిదండ్రులు కలిసి 'స్పిరిటాస్ రాంచ్ వాకర్స్ క్లబ్' ఏర్పాటు చేసుకున్నారు. 55మంది సభ్యులున్న ఈ క్లబ్‌లో రోజూ ఉదయం, సాయంత్రం నడకతో పాటు కుటుంబ విశేషాలు, రాజకీయ, సామాజిక అంశాలపై చర్చించుకుంటున్నారు. 'ఇండియాలోనైనా, అమెరికాలోనైనా కుటుంబ సంరక్షణలో తల్లిదండ్రులదే కీలక పాత్ర. తదుపరి తరంతో అనుబంధం కోసం అమెరికాలో పర్యటిస్తున్నామ'ని క్లబ్ సభ్యులు శ్యామ్‌రావు, కృష్ణారెడ్డి, ప్రసాద్ తెలిపారు.



## సినిమా



# హీరోల్లో ఇప్పటికీ ఆయనే నా క్రష్..

తెలుగు ప్రేక్షకులకు నటి కస్తూరి శంకర్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కథానాయికగా, సహాయ నటిగా సినిమాలు, సీరియల్స్ ద్వారా తనదైన ముద్ర వేసింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. కింగ్ నాగార్జున పట్ల తనకున్న బాల్యపు అభిమానాన్ని, ఆయనతో కలిసి పనిచేసిన అపురూప జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆమె చిన్నతనంలో యాంకర్‌గా పనిచేస్తున్న సమయంలో, ఒక స్టూడియోలో తన వర్క్ యాడ్ ఇస్తూ, ఎడిటింగ్‌లో ఉండగా నాగార్జున అన్నపూర్ణ ప్రొడక్షన్స్ తరపున ఏదో ఒక సినిమా పని మీద అక్కడికి వచ్చారని తెలిపారు. అప్పట్లో ఆమెకు నాగార్జున నటించిన సినిమా ఏదని తెలియదని, తాను చాలా చిన్నదని గుర్తుచేసుకున్నారు. అయితే, అప్పటికే గీతాంజలి సినిమాతో నాగార్జునకి అద్భుతమైన క్రేజ్ ఉండేదని, ఆయనను చూడగానే నాగార్జున... నాగార్జున అంటూ అందరూ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారని ఆమె వివరించారు.నాగార్జుని మొదటిసారి చూసినప్పుడు ఆయన వేసుకున్న డ్రెస్, తాను వేసుకున్న డ్రెస్ కూడా తనకు స్పష్టంగా గుర్తుందని ఆమె పేర్కొన్నారు. ఇది సినిమాకు ముందు జరిగిన సంఘటన అని, ఆయనను చూసినప్పుడు చేయి ఇచ్చి, ఆ చేతిని కడుక్కోకుండానే పాఠశాలకు వెళ్లి అందరికీ చూపించి, అది నాగార్జునని చూసిన చెయ్యి అని గర్వంగా చెప్పానని ఆమె తెలిపారు. ఆ అనుభూతి తనకెంతో గొప్పదని, ఆయనతో జోడిగా పనిచేయడం ఒక కల నెరవేరినట్లే అని ఆమె సంతోషంగా చెప్పారు.సెట్‌లో నాగార్జునకి ఈ విషయం చెప్పారా అని అడిగినప్పుడు, తాను ధైర్యంగా చెప్పానని, ఆయన ఇప్పటికీ తన పట్ల చాలా ప్రత్యేకమైన వ్యక్తి అని ఆమె స్పష్టం చేశారు. తనకు అన్ని హీరోలు ఇష్టమే అయినా, నాగార్జున మాత్రం సినిమా రంగానికి రాకముందే ఇష్టమని ఆమె తెలిపారు. ఆయనకు చెప్పడమే కాకుండా, హచ్ అడ్వర్టైజ్‌మెంట్‌లో వచ్చే చిన్న కుక్కపిల్లలాగా ఆయన వెనకే తిరిగేదాన్నని ఆమె సరదాగా చెప్పారు. బిగ్ బాస్ షో ద్వారా నాగార్జునలోని మేధస్సు, వ్యక్తిత్వం అందరికీ తెలిశాయని, ఆయన చాలా స్మార్ట్ అని, చాలా విషయాలు చదువుతారని ఆమె అన్నారు. సెట్‌లో ప్రతిరోజూ ఇద్దరూ కలిసి వార్తాపత్రికలు చదివేవారని, ఆయన హెడ్‌లైన్స్ చదివితే, తాను లోపలి పేజీలు చదివేదాన్నని, ఆ తర్వాత పేపర్‌ను మార్చుకునేవారమని ఆమె వివరించారు. నాగార్జున క్రీడలను, ముఖ్యంగా క్రికెట్‌ను ఎంతగానో ఇష్టపడతారని, కడపలో షూటింగ్ చేస్తున్నప్పుడు దక్షిణాఫ్రికాలో ప్రపంచ కప్ మ్యాచ్‌లు జరిగేవని, ఉదయం నాలుగు గంటలకు మ్యాచ్ మొదలవుతుంటే, తాను వచ్చి చూసేసరికి ఆయన అప్పటికే ఎదురుచూస్తూ కూర్చొని ఉండేవారని ఆమె తెలిపారు. సినిమా రంగానికి అతీతంగా నాగార్జున ఒక ఆల్‌రౌండ్ కంప్లీట్ మ్యాన్ అని అన్నారు.



# ఉదయాన్నే ఇది ఒక్క గ్లాస్ తాగండి చాలు..



ఆధునిక జీవనశైలిలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ముఖ్యంగా మధుమేహం వంటి దీర్ఘకాలిక జబ్బుల ప్రమాదం గణనీయంగా పెరుగుతోంది.. అయితే, ఒక వ్యాధి రావడం అనేది మెరుగైన జీవనశైలి లేకపోవడానికి సూచనగా పరిగణించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. జీవనశైలితోపాటు ముఖ్యంగా మనం తీసుకునే ఆహారం కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. రోగనిరోధక శక్తి బలంగా ఉండి, శరీరంలోని అవయవాలు సక్రమంగా పనిచేస్తుంటే, వ్యాధులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. అందుకే, అనేక జబ్బులను మందులు, శస్త్రచికిత్సలు లేకుండానే తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.ఉదాహరణకు, అధిక రక్తపోటు (బీపీ) కోసం ఉపయోగించే మందులు క్యాల్షియం ఛానల్ బ్లాకర్స్, డయూరిటిక్స్ వంటి అనేక రకాలుగా ఉంటాయి. రసాయనిక ఆధారిత మందులు కాకుండా, ఇంట్లో లభించే వస్తువులతోనే పరిష్కారాలను పొందవచ్చు. ముఖ్యంగా, కాకరకాయ రసం తాగడం వల్ల రక్తపోటు తగ్గి, బీపీ మందులు వాడాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు.

కాకరకాయ రసం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకరం. ఉదయం ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి.. ఇంకా బరువు తగ్గడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఈ రసం చర్మ ఆరోగ్యాన్ని, కాలేయ పనితీరును కూడా మెరుగుపరుస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ సహజ నివారణలు, ఔషధాల వలె లక్షణాలను తాత్కాలికంగా తగ్గించడమే కాకుండా, శరీరానికి హానికరం కాని మార్గాల్లో పని చేస్తాయి. సాధారణ మందులు వాడటం వల్ల కిడ్నీ సమస్యలు వంటి విపరీతమైన దుష్ప్రభావాలు వచ్చే అవకాశం ఉందని, ఒక్కో టాబ్లెట్‌కు 20-30 సైడ్ ఎఫెక్ట్‌లు ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ, చాలామంది ఈ దుష్ప్రభావాలను విస్మరించి, తేలికైన మార్గాలను ఎంచుకుంటారు. ప్రజలు నొప్పి వస్తే వెంటనే దానికి ఏదో ఒక టాబ్లెట్ వేసుకుంటారు.. ఇది మంచి పద్ధతి కాదు. ఇలాంటి పరిస్థితుల్లో సమస్యలు రాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడమే తెలివైన పని అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వ్యాధులు వచ్చినప్పుడు బిల్లులు కట్టడానికి బదులు, జీవనశైలిని మెరుగుపరచుకోవడం ద్వారా వాటిని నివారించడం ఉత్తమం.. ఇది కేవలం అవగాహన కోసం మాత్రమే.. ఏమైనా అనారోగ్య సమస్యలున్నా.. సందేహాలున్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించండి..

# కందిపప్పు వీరికి విషంతో సమానం.



తెలుగు ఇళ్లలో రోజూ వండే వంటకాల్లో కందిపప్పు ప్రధానమైనది. ముద్దపప్పు, సాంబార్, పప్పుచారు.. ఇలా ఏ రూపంలోనైనా కందిపప్పును ఇష్టంగా తింటాం. ఇందులో ప్రోటీన్లు అధికంగా ఉండటం వల్ల శాఖాహారులకు ఇది ఒక గొప్ప వరమని భావిస్తారు. అయితే నాణేనికి రెండో వైపు ఉన్నట్లుగా.. మనకు ఎంతో ఇష్టమైన ఈ కందిపప్పు కొందరికి మాత్రం సైలెంట్ పాయిజన్‌లా మారుతుంది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు దీనికి దూరంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అసలు కందిపప్పు ఎవరికి శత్రువు? ఎందుకు? అనే పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.

**కిడ్నీ బాధితులకు పొటాషియం ముప్పు**

కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఆహార నియమాలు చాలా కఠినంగా ఉంటాయి. కందిపప్పులో పొటాషియం పరిమాణం చాలా ఎక్కువ. సాధారణంగా ఆరోగ్యవంతుల్లో కిడ్నీలు రక్తంలోని అదనపు పొటాషియంను బయటకు పంపిస్తాయి. కానీ కిడ్నీలు బలహీనపడిన వారిలో ఈ పొటాషియం బయటకు వెళ్లలేక రక్తంలోనే పేరుకుపోతుంది. దీనివల్ల గుండె లయ తప్పడం జరుగుతుంది. తీవ్రమైన సందర్భాల్లో గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఇందులో ఉండే ఆక్సలేట్లు కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి కారణమవుతాయి.

**యూరిక్ యాసిడ్ -- కీళ్ల నొప్పుల సమస్య**

ఈ రోజుల్లో చాలా మందిని వేధిస్తున్న సమస్య రక్తంలో యూరిక్ యాసిడ్ పెరగడం. కందిపప్పులో ప్యూరిన్లు అనే రసాయనాలు ఉంటాయి. ఇవి శరీరంలో విచ్ఛిన్నమైనప్పుడు యూరిక్ యాసిడ్ విడుదల అవుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగితే అది స్ఫటికాలుగా మారి కీళ్ల మధ్య పేరుకుపోతుంది. దీనివల్ల గౌట్ అనే వ్యాధి వచ్చి కీళ్ల నొప్పులు, వాపులు, నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. మీకు ఇప్పటికే కీళ్ల నొప్పులు ఉంటే, కందిపప్పు తిన్న మరుసటి రోజే ఆ నొప్పులు తీవ్రమవ్వడం మీరు గమనించవచ్చు.

**జీర్ణ వ్యవస్థ -- గ్యాస్ట్రిక్ సమస్యలు**

కందిపప్పులో ప్రోటీన్లతో పాటు సంక్లిష్టమైన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. వీటిని జీర్ణం చేయడానికి మన జీర్ణక్రియ కష్టపడాల్సి ఉంటుంది.

అజీర్ణం: తిన్న పప్పు సరిగ్గా అరగక కడుపు ఉబ్బరంగా అనిపించడం, గుండెల్లో మంట కలగడం సహజం.

గ్యాస్: పప్పులోని కొన్ని అంశాలు పేగుల్లోని బ్యాక్టీరియాతో కలిసి అధిక గ్యాస్‌ను విడుదల చేస్తాయి.

పైల్స్ బాధితులు: మూలవ్యాధి లేదా ఫిస్టులా ఉన్నవారికి కందిపప్పు మలబద్ధకాన్ని కలిగిస్తుంది. మలవిసర్జన కష్టంగా మారినప్పుడు ఆ ప్రాంతంలో ఒత్తిడి పెరిగి రక్తస్రావం లేదా వాపు వచ్చే అవకాశం ఉంది.

**అలెర్జీలు -- చర్మ సమస్యలు**

ప్రోటీన్ అలెర్జీ ఉన్నవారికి కందిపప్పు ఒక పీడకల. కొంతమందిలో కందిపప్పు తిన్న వెంటనే చర్మంపై దద్దుర్లు రావడం, దురద పెట్టడం లేదా కళ్లు ఎర్రబడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మన శరీరం ఆ ప్రోటీన్‌ను ఒక పరాయి పదార్థంగా గుర్తించి హిస్టామిన్‌లను విడుదల చేయడం వల్ల ఈ అలెర్జీ ప్రతిచర్యలు జరుగుతాయి.

**బరువు తగ్గాలనుకునే వారు జాగ్రత్త**

కందిపప్పులో క్యాలరీలు కూడా ఎక్కువే. మీరు కఠినమైన డైట్‌లో ఉండి బరువు తగ్గాలనుకుంటే, అతిగా కందిపప్పు తినడం వల్ల బరువు పెరిగే అవకాశం ఉంది. దీనికి బదులుగా తక్కువ క్యాలరీలు ఉండే పెసరపప్పును డైట్‌లో చేర్చుకోవడం ఉత్తమం.

**ప్రత్యామ్నాయం ఏంటి?**

కందిపప్పు పడదు కదా అని పప్పులు తినడం మానేయక్కర్లేదు. కందిపప్పుకు బదులుగా పెసరపప్పు అత్యుత్తమ ప్రత్యామ్నాయం. ఇది సులభంగా జీర్ణమవుతుంది. యూరిక్ యాసిడ్ పెంచదు. చల్లదనాన్ని ఇవ్వడంతో పాటు కిడ్నీలపై తక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది.

గమనిక : ఈ వివరాలు కేవలం సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఏదైనా వైద్య పరిస్థితికి చికిత్స, ఆహార మార్పుల కోసం అర్హత గల ఆరోగ్య నిపుణుడి సలహా తప్పనిసరి.

# టీమిండియా టీ20 కెప్టెన్సీలో భారీ మార్పు..




సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ ఏడాది మినీ వేలంలో ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్‌ను ఏకంగా 13 కోట్ల రూపాయల భారీ ధరకు దక్కించుకుంది. వేలంలో ఇతర జట్లతో పోటీ పడి మరీ అతడిని కొనుగోలు చేసిన ఆరెంజ్ ఆర్మీకి నిరాశే ఎదురైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు కేవలం రెండు మ్యాచ్‌లే ఆడిన లివింగ్‌స్టోన్, బ్యాట్‌తో కేవలం 15 పరుగులు మాత్రమే చేశాడు. బౌలింగ్‌లోనూ ఒక్క ఓవర్ కూడా వేయకపోవడం గమనార్హం. అతనిపై పెట్టిన భారీ పెట్టుబడి ప్రస్తుతం వృథా అయినట్లే కనిపిస్తోంది.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: నిరాశపరిచిన జాకబ్ బెథెల్..**

ఆర్సీబీ జట్టు గాయపడిన ఫిల్ సాల్ట్ స్థానంలో ఇంగ్లాండ్ యువ ఆటగాడు జాకబ్ బెథెల్‌ను జట్టులోకి తీసుకుంది. గతంలో మంచి ప్రదర్శన చేసినందుకుగాను అతడిని 2.60 కోట్ల రూపాయలకు అట్టిపెట్టుకుంది. అయితే ఈ సీజన్‌లో నాలుగు మ్యాచ్‌లాడిన బెథెల్ కేవలం 43 పరుగులు మాత్రమే చేశాడు. సగటు కేవలం 10.75గా ఉంది. అత్యధిక స్కోరు 20 పరుగులు మాత్రమే కావడం అతని పేలవ ఫామ్‌కు నిదర్శనం.

**రాజస్థాన్ రాయల్స్: షిమ్రాన్ హెట్మెయర్ పేలవ ఆటతీరు..**

మెగా వేలానికి ముందు రాజస్థాన్ రాయల్స్ జట్టు జోస్ బట్లర్ వంటి స్టార్ ఆటగాడిని వదులుకొని మరి షిమ్రాన్ హెట్మెయర్‌ను 11 కోట్ల రూపాయలకు అట్టిపెట్టుకుంది. కానీ హెట్మెయర్ ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఏడు ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 78 పరుగులు మాత్రమే చేశాడు. లక్నో జట్టుపై చేసిన 22 పరుగులే ఈ సీజన్‌లో అతడి అత్యుత్తమ స్కోరు. ఫినిషర్‌గా గుర్తింపు పొందిన హెట్మెయర్ ఇలా వరుసగా విఫలం కావడం పింక్ ఆర్మీని కలవరపెడుతోంది.

**ఢిల్లీ క్యాపిటల్స్: డేవిడ్ మిల్లర్ 'కిల్లర్' ప్రదర్శన ఎక్కడ?**

దక్షిణాఫ్రికా విధ్వంసకర బ్యాటర్ డేవిడ్ మిల్లర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ 2 కోట్ల రూపాయల కనీస ధరకు కొనుగోలు చేసింది. మిడిల్ ఓవర్లలో వేగంగా పరుగులు తీస్తాడని భావించినప్పటికీ, అతను ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఏడు మ్యాచ్‌ల్లో కలిపి 123 పరుగులు చేసినా, జట్టుకు అవసరమైన సమయంలో వేగంగా ఆడటంలో విఫలమయ్యాడు. గుజరాత్‌పై చేసిన 41 పరుగులు మినహా, మిగిలిన మ్యాచ్‌ల్లో మిల్లర్ ప్రభావం చూపలేకపోయాడు. దీంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ అవకాశాలు కూడా సంక్లిష్టంగా మారాయి.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:1-94 nekunampuram,pokur,Prakasam,andhrapradesh 523113Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2843. Ph:9849707349 . email:kvp6858@gmail.com.